క్లుప్తంగా

మేకపాటి ప్రత్యేక పూజలు


రాజగోపాల్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

దుత్తలూరు: దుత్తలూరు ఊరకొండ దిగువ భాగాన ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

మెరుగైన వైద్యానికి చెన్నైకు తరలింపు

సంగం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరులో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం శుక్రవారం చెన్నైకు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. సంగం గ్రామానికి చెందిన సబ్బు నవీన్ నెల్లూరు దేవదాయశాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. గురువారం బైక్‌లో సంగం వస్తుండగా సిద్ధీపురం వద్ద కారు బైక్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో నవీన్‌ను అదే కారులో నెల్లూరు వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వింజమూరు(ఉదయగిరి): దుత్తలూరు మండలం సోమలరేగడ సమీపంలో ఈ నెల 1వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదానికి గురైన తీవ్రంగా గాయపడిన లెక్కల శేషాద్రిరెడ్డి తిరుపతిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడు వింజమూరు మండలం గుండెమడకల గ్రామానికి చెందినవాడు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేలు జరిమానా

దుత్తలూరు: మద్యం తాగి వాహనం నడిపిన దేవినేని వెంకటసుబ్బయ్యకు ఉదయగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జె.అంజయ్య రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ మోతాదుకు మించి మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తారన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

సంగం: పురుగు మందు తాగి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న మండలంలోని దువ్వూరుకు చెందిన వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. దువ్వూరు పడమటిదళితవాడకు చెందిన వెంకటేశ్వర్లు (35) స్థానికంగా అత్త ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో తరచూ భార్య, అత్త మందలిస్తున్నారు. బుధవారం మద్యం తాగిన వెంకటేశ్వర్లును కుటుంబ సభ్యులు మందలించడంతో గురువారం పురుగు మందు తాగాడు. అతడిని నెల్లూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖదీర్‌బాబుకు వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు హర్షం

కావలి: కావలి విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి మహమ్మద్ ఖదీర్‌బాబుకు వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు రావడం గర్వకారణమని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయిని సి. శారద శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఖదీర్‌బాబు సాహిత్యాభిలాష కావడంతో ఆయన దర్గామిట్ట కథలను రాసేలా ప్రోత్సహించిందని చెప్పారు.

పోలీసుల సేవలు మరువలేం

ఆత్మకూరు: ఉద్యోగ నిర్వహణలో పని వేళలతో సంబంధం లేకుండా విధులు నిర్వహించే పోలీసుల సేవలు మరువలేమని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులైన పోలీసుల నిస్వార్థ సేవలు మరచిపోలేనివని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు.

నిమ్మచెట్లలో హైడ్రోజల్

మర్రిపాడు: నిమ్మచెట్లలో నీటి ఎద్దడి తలెత్తకుండా హైడ్రోజెల్ వినియోగంపై మర్రిపాడు మండలం పొంగూరులో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో ఉద్యాన, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంలో ప్రదర్శనా క్షేత్రాన్ని నిర్వహించారు. 100 కిలోల వర్మీ కంపోస్టు ఎరువులో 2 కిలోల ట్రైకోడెర్మావిరిడి, ఒక కిలో హైడ్రోజెల్‌ను కలిపి ఆ మిశ్రమాన్ని 100 నిమ్మ చెట్లకు వాడించారు. ఆత్మ పీడీ ఎస్.దొరసాని, కేవీకే సమన్వయకర్త జి.శివజ్యోతి, ఆత్మ డీపీడీ జీ శివనారాయణ, కేవీకే శాస్త్రవేత్త డి విజయ్‌కుమార్ నాయక్, పి.అనూష, వ్యవసాయాధికారి రామ్మోహన్, ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ రాజశేఖర్, వీఏఏ పెంచలయ్య, ప్రవీణ్ రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం.. అవినీతి రహిత పాలన

- చంద్రబాబు ముఠా దోపిడీ, మోసాలు నుంచి రాష్ట్రాన్ని కాపాడడానికే జగన్ అవసరం
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పక్కన ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు

కావలి: ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకంటే.. 'ప్రజా సంక్షేమానికి, అవినీతి రహిత పాలనకు, ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని అభూత కల్పనలు, గ్రాఫిక్స్‌తో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని దోపిడీ చేసే చంద్రబాబు ముఠాకు అడ్డుకట్ట వేయడానికే' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. దగదర్తిలో శుక్రవారం మండలంలోని వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం ఎన్ని రకాలు అడ్డదారులైనా తొక్కడానికి చంద్రబాబు దొంగ హామీలు ఇస్తాడని, వాటిని నమ్మి మోసపోవద్దు ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కనీసం ఒక్కసారి కూడా సచివాలయం ముఖం చూడని, ఏ తప్పు చేయని వైఎస్ జగన్‌పై తప్పుడు అవినీతి కేసులు బనాయించి 16 నెలలు జైల్లో పెట్టిన విషయం అందరికీ తెలుసన్నారు. అయితే ప్రతి పథకంలో అవినీతి చేసి దొరికన దొంగ చంద్రబాబు అన్నారు. స్కిల్ కుంభకోణంలో 13 చోట్ల సంతకాలు పెట్టి ఆధారాలతో దొరికిపోయిన కూడా చంద్రబాబు ఏ తప్పు చేయలేదు అంటున్నారంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. మామ ఎన్టీఆర్‌నే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, ప్రజలను వెన్నుపోటు పొడవడం అలవాటుగా చేసుకున్నాడన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌పై కుటుంబ సభ్యులకే బాధ లేదు

చంద్రబాబు దేశంలోనే అతిపెద్ద అవినీతి పరుడని, అందుకే చంద్రబాబు అరెస్ట్‌పై ఆయన కుటుంబ సభ్యుల్లోనే బాధ కనిపించడం లేదన్నారు. ఆయన అరెస్ట్‌ను రాజకీయంగా వాడుకుని లబ్ధి పొందాలని ఆయన కొడుకు, కోడలు, భార్య చూస్తున్నారన్నారు. చంద్రబాబు బాధలో ఉంటే బాలకృష్ణ కొత్త సినిమా ఎలా రిలీజ్ చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు ఆరోగ్యంగా ఉన్నాడు కాబట్టే జైల్ నుంచి రాజకీయం చేస్తున్నారని, ఆయన అనారోగ్యంగా ఉంటే కేజీ బరువు ఎలా పెరుగుతారన్నారు.

దళితులకు సామాజిక న్యాయం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే దళితులకు సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో దళితులందరూ ఆత్మగౌరవంతో జీవిస్తున్నారన్నారు. రాజకీయ పదవుల్లో ప్రాధాన్యం వంటి ఎన్నో మేళ్లను పొందడమే కారణమన్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి ఎన్నో కార్యక్రమాలు నేడు కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అమలవుతున్నాయని, ఇవి ఇలాగే కొనసాగాలి అంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భారీ ఎత్తున అమలు చేస్తున్న సంక్షేమం, ఇతర కార్యక్రమాలు జగన్‌తోనే సాధ్యమని, ఆయన మరోసారి అధికారంలోకి రాకపోతే అవన్నీ ఆగిపోతాయని ప్రజజలకు వివరించాలని ఎమ్మెల్యే తెలిపారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే చంద్రబాబు, పవన్‌లను నమ్మొద్దని ప్రజలకు చెప్పి, జగన్ ఎందుకు అవసరం అనే విషయాన్ని ప్రజలకు ఎక్కడిక్కడ వివరించి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ, పార్టీ మంల కన్వీనర్ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామిరెడ్డిని సత్కరించిన పద్మశాలీలు


పద్మశాలీ సంఘం సభ్యులతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అల్లూరు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మేడా మాధవ్ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. శుక్రవారం మేడా మాధవ్ నివాసంలో ఏర్పాటు చేసిన పద్మశాలి సంఘం సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన నిరుపేద పద్మశాలీలకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలీలకు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. అర్హులైన పద్మశాలీలకు ఇంటి నివేశ స్థలాలను అందజేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల, మత, ప్రాంత, పార్టీలను చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మేడా శ్రీనివాసులరెడ్డి, పవన్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, బిట్రగుంట రమేష్ రెడ్డి, మేడా నారాయణ, పద్మశీలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి మళ్లీ ముఖ్యమంత్రి కావాలి


ప్రచార కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు

మర్రిపాడు: రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సంక్షేమ సారథిగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరం సమష్టిగా కష్టించి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో 'ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి' కార్యక్రమంపై మండల స్థాయి నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికి దాదాపుగా రూ.3 లక్షల కోట్ల సంక్షేమ పథకాలను అందించిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన ప్రవేశ పెట్టిన నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందిందని, సంక్షేమ ప్రదాత అందరికీ చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నవంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సిద్ధం రెడ్డి మోహన్‌రెడ్డి, సింగనపల్లి మాజీ సర్పంచ్ రేవూరు గోపాల్ రెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధికే 'వై ఏపీ నీడ్ జగన్'


మాట్లాడుతున్న పీర్ల పార్థసారథి

చేజర్ల: రాష్ట్రాభివృద్ధికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని పలువురు నేతలు చెప్పారు. చేజర్లలో శుక్రవారం 'వై ఏపీ నీడ్ జగన్' జరిగింది. చేజర్ల జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమ కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలోని ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం చూపించగలిగామన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మంది పేద ప్రజలు మెరుగైన వైద్యం చేయించుకోగలిగారన్నారు. నవంబర్ 1వ తేదీ నుంచి జరిగే ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి అనే కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొమ్మి సిద్దులనాయుడు, జిల్లా యువజన నేత మురళీకృష్ణ మాధవ్, నాయకులు తేళ్ల శేఖర్‌రెడ్డి, బి.రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు, జయంతుల్ నాయుడు, చంద్రశేఖర్, రవీంద్రనాయడు, రాంబాబు, సుందరరామిరెడ్డి, జయరామయ్య, శివకుమార్, కృష్ణారెడ్డి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే జగన్‌ను మళ్లీ సీఎంను చేస్తాయి


వికలాంగుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని, ఆయన అందజేస్తున్న సంక్షేమమే ఆయన్ను తిరిగి సీఎంను చేస్తుందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మసముద్రం, కేశవరం గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజగోపాల్‌రెడ్డి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లను అందించారు. సమస్య ఉంటే చెప్పండి అంటూ ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి అధికారులకు సూచనలు జారీ చేశారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, మధ్య తరగతి పిల్లలు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఒక్క పేదవాడికి కూడా ఇళ్లు కాని, ఇళ్ల స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించాడన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల జీవన ప్రమాణాలు మెరుగు అయ్యాయని తెలిపారు. గ్రామాల్లో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాల ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి గ్రామ స్వరాజ్యానికి సరైన భాష్యం చెప్పారన్నారు. ఉదయగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని 8 మండలాల్లో నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తనకు తెలపాలని కోరారు. అవినీతి రహిత పాలన అందిస్తూ మీ అందరికీ తోడుగా నిలుస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, స్థానిక సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు, ఉప సర్పంచ్ గణాది రవిచంద్ర, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి వంటేరు రామచంద్రారెడ్డి, మండల బూత్ కమిటీల అధ్యక్షుడు సురె వెంకటశేషారెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, తహసీల్దార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం లాంటిదని ఖరీదైన వైద్యం వారి ముంగిటకే అందుబాటులోకి వచ్చిందని పలువురు వక్తలు అన్నారు. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్


ఆత్మకూరు: జగనన్న ఆరోగ్య కిట్‌లను అందజేస్తున్న కమిషనర్ బి నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు కౌసల్యమ్మ, కె రమాదేవి, చెరుకూరు కామాక్షయ్య నాయుడు, శివకోటారెడ్డి తదితరులు


కొండాపురం: వైద్యపరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ పరుచూరి మాల్యాద్రి, ఎంపీటీసీ లెక్కల వెంకటరమణయ్య తదితరులు


దుత్తలూరు: సురక్ష కిట్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు లెక్కల లక్ష్మీకాంతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో అల్లూరు టౌన్, అల్లూరుపేట, నార్త్ ఆములూరులో శనివారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ షేక్ మస్తాన్ తెలిపారు.

సరస్వతీ నమస్తుభ్యం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు కొలువైన ఆలయాల్లో విశేష పూజలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఆత్మకూరులోని పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయం, జ్వాలాముఖి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, పంటవీధి పార్వతిదేవి ఆలయం, కాశీనాయన ఆశ్రమంలోని సరస్వతీ ఆలయం, సుందరమ్మ కోదండ రామాలయాల్లో అమ్మవారి కలశాలకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం చేయించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. – సాక్షి, నెట్‌వర్క్


సంగం: సరస్వతీదేవి అలంకారంలో కామాక్షితాయి


ఆత్మకూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతీ అలంకరణ


ఆత్మకూరు: సుందరమ్మ కోదండరామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


సంగం: రాళ్లతో పాలేటి గంగమ్మతల్లిని అలంకరించిన దృశ్యం


సోమశిల : సోమేశ్వరాలయంలో సరస్వతీ అలంకారంలో కామాక్షమ్మ


కలిగిరి: తెల్లపాడులో మహాలక్ష్మీదేవిగా భద్రకాళీ అమ్మవారు


వరికుంటపాడు: సరస్వతీదేవి అలంకరణలో నాగారపమ్మ


దుత్తలూరు: గుదేవారిపాలెంలో సరస్వతీదేవి అలంకరణలో రేణుకా ఎల్లమ్మ


ఉదయగిరి: పార్వతీ పరమేశ్వర ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో పార్వతీదేవి


చేజర్ల: యనమదలలో సరస్వతీ దేవిగా చింతాలమ్మ అమ్మవారు


అల్లూరు: రామలింగేశ్వర స్వామి ఆలయంలో సరస్వతీదేవిగా పర్వతివర్ధిని అమ్మవారు